## మక్క కంకులు కాలిన రైతులను ఆదుకోవాలి


కాలిన కంకులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

గీసుగొండ, మే 5: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మక్కజొన్న కంకులు, గింజలు కాలిపోయిన బాధిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. అగ్రిప్రమాదంలో కాలిపోయిన మక్కజొన్న కంకుల కుప్పలు, మక్కలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగి 24గంటలవుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించకపోవటం దారుణమన్నారు. గ్రామంలో సుమారు 40 ఎకరాల్లో మంటలు విస్తరించి 500 క్వింటాళ్ల మక్కజొన్న కంకులు, మక్కలు కాలిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే రైతులు మక్కలను వెంటనే అమ్ముకునేవారని తెలిపారు. కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, నాయకులు శ్రవణ్, పూర్ణ చందర్, వెంకటేశ్వర్లు, సంగెం మాజీ జడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఉజ్వల్, రఘుపతి, రాజు పాల్గొన్నారు. కాగా, మండలంలోని బొడ్డుచింతలపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోపగాని దేవేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు అనిల్, యుగేందర్ పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, చిత్రంలో ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, మే 5: అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ సత్యశారద అన్నారు. మండలంలోని బండౌతాపురం, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సులకు కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్ధన్నపేట మండలాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని తెలిపారు. అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బండౌతాపురంలో 1,320 ఎకరాల వ్యవసాయభూమి ఉన్నందున ఈ భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విచారణ జరిపి అధికారులు తగిన విధంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ విజయ్‌సాగర్ పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

కరీమాబాద్, మే 5: విద్యుత్ ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలంగాణ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా రంగశాయిపేట ఎంకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయదారులకు విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. సర్కిల్ పరిధిలోని డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించామని, ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ భద్రతపై జానపద కళాకారులు అవగాహన కల్పించారు. వరంగల్ సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ కే.గౌతంరెడ్డి, డీఈ ఆనంద్, మల్లికార్జున్, ఏడీఈలు చంద్రమౌళి, సురేష్, కిషోర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

వరంగల్, మే 5 : ఆల్ ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా దేశ వ్యాప్తంగా మే 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు మున్సిపల్ కార్మికులు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు సమ్మె నోటీసు అందజేశారు. సోమవారం ఆమెను కలిసి కార్మిక సంఘాల నాయకులు సమ్మెలో పాల్గొంటున్నామని చెప్పారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు కాసు మాధవి, జన్ను ప్రకాశ్, సాంబయ్య, సింగారపు కృష్ణ, రాజు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

jobs Apply Now!

★Urgent requirement for ICICI, HDFC, AXIS INDUSIND BANK'S LOANS. DSA EXP. & FRESHER FEMALE TELE-CALLERS SAL.+INC.etc... JOB LOCATION: HNK CONT: +91 9182172367.
NTW-7711

CHANGE OF NAME

★I, ALLAM SANDEEP S/o ALLAM LACHAIAH R/o H. No. 1-42, Shayampet Haveli, Geesugonda Mandal, Warangal Dist., have changed my name from ALLAM SADANANDAM to ALLAM SANDEEP for all Purposes.
NTW-000

CHANGE OF NAME

★I, the undersigned GAYYI NARAYANA has changed my name from GAYYI NARAYANA (Old Name) to GAI NARAYANA (New Name) for all purposes and I am residing at H No 2-7-454, Excise Colony, Waddepally, Hanamkonda, Hanumakonda District-506370 T.G., India, and solemnly declare.
NTW-17619

CHANGE OF NAME

★I, the undersigned GAYYI SULOCHANA has changed my name from GAYYI SULUOCHANA (Old Name) to GAI SULOCHANA (New Name) for all purposes and I am residing at H No 2-7-454, Excise Colony, Waddepally, Hanamkonda, Hanumakonda District-506370 T.G., India, and solemnly declare.
NTW-17621

CHANGE OF NAME

★I, the undersigned GAYYI NARESH BABU has changed my name from GAYYI NARESH BABU (Old Name) to GAI NARESH BABU (New Name) for all purposes and I am residing at H No 2-7-454, Excise Colony, Waddepally, Hanamkonda, Hanumakonda District-506370 T.G., India, and solemnly declare.
NTW-17620

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- ప్యాడీ క్లీనర్ నిబంధనతో తీవ్ర జాప్యం
- అకాల వర్షాలతో ఆందోళనలో రైతులు
- కోతలు విధించకుండా కొనుగోళ్లు చేయాలని డిమాండ్


రాగంపేట కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

ఖానాపురం, మే 5: మండలంలోని పాకాల ఆయకట్టులో వరికోతలు జోరుగా సాగుతున్నాయి. రైతులు పది రోజులుగా హార్వెస్టర్లతో వరి కోతలు చేస్తున్నారు. యాసంగి సీజన్ కావడంతో ధాన్యం కోసి ఆరబెట్టిన రెండురోజుల్లోనే తేమశాతం 15లోపు వస్తున్నది. దీంతో రైతులు ధాన్యాన్ని త్వరగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలన్నీ ధాన్యంతో నిండిపోతున్నాయి. కానీ కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఒకటి, రెండు కొనుగోలు కేంద్రాల్లోనే సోమవారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రాగంపేట, ఖానాపురం, కొత్తూరు, మనుబోతులగడ్డ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉన్నా కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో ధాన్యం అకాల వర్షాలకు తడుస్తుందని ఆందోళన చెందుతున్నారు.

**మిల్లర్లతో డీల్ కుదిరితేనే..**

రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్‌లో పోసిన తర్వాతే కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వ నిబంధన రైతులకు శాపంగా మారింది. ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్‌లో పోసి శుభ్రం చేసిన తర్వాతే టోకెన్లు ఇస్తామని వ్యవసాయాధికారులు కొర్రీలు పెడుతున్నారు. పాకాల ఆయకట్టులో రైతులు పండించిన లక్షల బస్తాల ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్‌లో పోసిన తర్వాతే కొనుగోలు చేయాలంటే కొనుగోళ్లలో తీవ్ర జాప్యమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు సాయంత్రమైందంటే చాలు ఆకాశం మేఘావృతమై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్యాడీ క్లీనర్‌లో పోయకుండా కొనుగోలు చేయాలంటే మిల్లర్లు బస్తాకు 2 నుంచి 3 కిలోలు అదనంగా కాంటా పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మిల్లర్లతో డీల్ కుదరకపోవడంతో వారు కాంటా లైన ధాన్యాన్ని మిల్లుల్లో అన్‌లోడ్ చేసుకునేది లేదని చెబుతుండడం వల్లే ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదని కొందరు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిని రైతులు చాలావరకు నష్టపోయారు. మరింత నష్టం జరగకుండా ప్యాడీక్లీనర్‌లో పోయాలనే కండిషన్ లేకుండా అధికారులు పరిష్కరించి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

## ఆర్చరీలో వేసవి శిక్షణ శిబిరం

పర్వతగిరి, మే 5: మండలంలోని కల్లెడ గ్రామంలో ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీలో ఈనెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ సోమవారం తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు విలువిద్య, యోగ, మెడిటేషన్, శారీరక, మానసిక ఎదుగుదలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఉంటుందని తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలకు ఆర్చరీ కోచ్, రేణు మండల్ 7838613186, 9959301913 సెల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## నేటి నుంచి రైతు అవగాహన సదస్సులు

సంగెం, మే 5: మండలంలో మంగళవారం నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి చల్ల యాకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తేదీ చింతలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు చేస్తారని పేర్కొన్నారు.

## నేడు తెలుగు భాషాభిమానుల చర్చాగోష్టి

పోచమ్మమైదాన్, మే 5: తెలుగు రాష్ట్రాల్లో మాతృభాష తెలుగుకు ఆదరణ కరువవుతోందని, రాజ్యాంగం గుర్తించిన 22 భాషలకు సమానమైన గుర్తింపు ఉండాలని ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో రెండో ఆప్షన్‌గా సంస్కృతాన్ని తీసుకోవాలని బోర్డు జీవో జారీ చేసిందని, ఈ జీవో వల్ల తెలుగు భాషను ఇంటర్‌లో లేకుండా చేసే కుట్రగా భావించాల్సి వస్తుందని వివరించారు. దీంతో తెలుగు భాషా పరిరక్షణ కోసం జిల్లాలోని కవులు, రచయితలు, భాషాభిమానులు ఈ నెల 7న మంగళవారం హనుమకొండలోని రాజరాజ నరేంద్ర భాషా నిలయంలో జరిగే చర్చా గోష్టికి రావాలని పిలుపునిచ్చారు.

## కార్పొరేషన్ మాజీ చైర్మన్ తల్లికి 'పెద్ది' పరామర్శ



పరామర్శిస్తున్న పెద్ది

నర్సంపేట, మే 5: దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తల్లి సుమతిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. ఆమె ఐదు రోజులుగా అనారోగ్య సమస్యలతో హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సోమవారం మాజీ ఎమ్మెల్యే పెద్ది ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వాసుదేవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రెడ్కో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై సతీష్‌రెడ్డి ఉన్నారు.

## వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

వర్ధన్నపేట, మే 5: విద్యుత్ తీగలు తాకడంతో మంటలు అంటుకొని వరిగడ్డి, ట్రాక్టర్ దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని ఇల్లంద శివారులో సోమవారం జరిగింది. మండలంలోని కొత్తపల్లి నుంచి గడ్డిమోపుల లోడుతో ఇల్లంద వైపు వస్తున్న ట్రాక్టర్ ఇల్లంద శివారులో విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ వెంటనే గుర్తించి ట్రాక్టర్ దిగి పరుగులు పెట్టాడు. వరిగడ్డి కట్టలకు మంటలు వ్యాపించగా, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైరింజిన్‌తో సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పేశారు. అప్పటికే సుమారు రూ.30వేల విలువైన వరిగడ్డితోపాటు సుమారు రూ.5లక్షల విలువైన ట్రాక్టర్ కూడా పూర్తిగా దగ్ధమైందని ట్రాక్టర్ యజమాని, రైతు తెలిపారు.

## బాలింత ఆత్మహత్య


నిరోష (ఫైల్)

చిట్యాల, మే 5 : బాలింత పద్దెనిమిది రోజుల శిశువును వదిలి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముచినిపర్తిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కందికొండ శంకర్ రెండో కూతురు నిరోష(26)కు వరంగల్ దేశాయిపేటకు చెందిన మునుగొండ ప్రశాంత్‌తో గతేడాది వివాహం జరిగింది. కాగా, నిరోష 18రోజుల క్రితం పాపకు జన్మనిచ్చింది. భర్త ప్రశాంత్, అతడి తల్లి లక్ష్మితో కలిసి ముచినిపర్తి వచ్చి పురుడు చేద్దామని నిశ్చయించుకున్నారు. ఖర్చు మీరే భరించాలని నిరోష కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. తమకు పురుడు చేసే స్తోమత లేదని తండ్రి చెప్పాడు. దీంతో ప్రశాంత్ నిరోషతో ఫోన్లో మాట్లాడిన తర్వాత ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. స్థానికులు చిట్యాలలోని సివిల్ దవాఖానకు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లుడు మునుగొండ ప్రశాంత్, అత్త లక్ష్మి, మామ సాంబయ్య ఒత్తిడితోనే కూతురు ఆత్మహత్య చేసుకున్నదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబేషనరీ ఎస్సై హేమ తెలిపారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం


వర్ధన్నపేట: మాట్లాడుతున్న జిల్లా అకాడమిక్ కో ఆర్డినేటర్ సృజన్‌తేజ

వర్ధన్నపేట/ గిర్మాజీపేట/ నెక్కొండ/ పర్వతగిరి, మే 5: జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వర్ధన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల, నగరంలోని మట్టెవాడ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన వరంగల్ జిల్లా అకాడమిక్ కో ఆర్డినేటర్ సృజన్‌తేజ మాట్లాడారు. జిల్లాలో వంద మంది విద్యార్థులకుపైగా ఉన్న 50 ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 రోజులపాటు జరిగే ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆటలు, కళలు, స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, డ్రాయింగ్, క్రాఫ్ట్ వంటి అంశాల్లో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. ఎంఈవోలు శ్రీధర్, ఎంఈవో గంప అశోక్‌కుమార్, హెచ్ఎంలు అనిల్‌కుమార్, అరుణ పాల్గొన్నారు. నెక్కొండ జడ్పీ హైస్కూల్, సూరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను ఎంఈవో రత్నమాల సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 19వరకు శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యార్థులకు డ్రాయింగ్, డాన్స్, క్రాఫ్ట్, కరాటే, గేమ్స్, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. నెక్కొండ, సూరిపల్లి హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు రంగారావు, పరమేశ్వర్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, అయిలయ్య, కుమారస్వామి, కిషన్ రావు, సుజాత పాల్గొన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ గాయపు లింగారెడ్డి ప్రారంభించారు. 15 రోజులపాటు కొనసాగే శిక్షణ శిబిరంలో విద్యార్థులు, ఆటపాటలతోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, క్రాఫ్ట్, సంగీతం వంటి వాటిలో శిక్షణ పొందవచ్చని, ఇందుకు నలుగురు వలంటీర్లను నియమించినట్లు హెచ్ఎం పాక రమేశ్‌బాబు తెలిపారు. రోజూ 8గంటల నుంచి 11 గంటల వరకు సాగే ఈ కార్యక్రమ అనంతరం విద్యార్థులకు స్నాక్స్, అరటి పండ్లు పంపిణీ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు కే శ్రీధర్, వలంటీర్ ఉపాధ్యాయులు పీఈటీ సురేష్, మహంకాళి రామస్వామి, తీగల సుప్రజ, గారే జయ రావు పాల్గొన్నారు.

**కాట్రపల్లిలో వాలీబాల్ శిక్షణ**


రాయపర్తి: కాట్రపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోచ్, పాఠశాల పీడీ పుట్ట సమ్మయ్య సూచించారు. ఈనెల 1వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు 35 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం క్రీడా శిక్షణ తరగతుల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోజూ ఉదయం 6 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు క్రీడా శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల 10-18 ఏళ్లలోపు బాల బాలికలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 95335 66919, 82873 51357లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

## అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్

నర్సంపేట, మే 5: అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం చట్టం చేయాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఐస్‌క్రీమ్ వర్కర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు కొమురయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడేలా సవరణలు చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 20న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఐస్‌క్రీమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చెరుపల్లి కొమురయ్య, కార్యదర్శిగా ఎండీ అజీమ్, ఉపాధ్యక్షుడిగా సలేంద్ర చేరాలు, కోశాధికారిగా గుండు స్వామి, కమిటీ సభ్యులుగా అన్నెబోయిన రాజు, సారయ్య, రాజు, మహేందర్, నర్సయ్య, శ్రీను, భద్రు, పాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 119 దరఖాస్తులు


కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి

ఖిలావరంగల్, మే 5: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి 119 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా హౌసింగ్‌కు శాఖకు చెందినవి 42, రెవెన్యూశాఖకు చెందినవి 35 దరఖాస్తులు వచ్చాయి. తమ కుమారులిద్దరూ సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం లేదని గీసుగొండ మండలం కోనాయిమాకులకు చెందిన పోలీసు రాజేశ్వర్‌రావు, లింగబాయి ఫిర్యాదు చేశారు. పెద్ద కుమారుడు మోసపూరితంగా 8 ఎకరాలు పట్టా చేసుకున్నాడని, అతడి పేర పట్టాను రద్దు చేసి సంరక్షణ బాధ్యతలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. సుదరయ్యనగర్‌కు చెందిన దివ్యాంగురాలు సాదిక తనకు బ్యాటరీ వాహనం ఇప్పించాలని కోరుతూ విన్నవించారు. తనకు మూడేళ్లుగా పింఛన్ రావడం లేదని శివనగర్‌కు చెందిన దివ్యాంగుడు పీ రాజు దరఖాస్తు చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, డీపీవో అనురాధ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి పాల్గొన్నారు.

# వినతులను తక్షణమే పరిష్కరించాలి

- టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- బల్దియా 'గ్రీవెన్స్'లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 5 : గ్రీవెన్స్ సెల్‌లో ప్రజలు ఇచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలోని ఆదర్శకాలనీలో రహదారికి అడ్డంగా కుక్కల చంద్రమౌళి ప్రహరీ నిర్మిస్తుండగా తమకు ఇబ్బందులు కలుగుతున్నట్లు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 43వ డివిజన్ రహమత్ నగర్‌లో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని, జవాన్ రవికి చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని న్యూ కాకతీయ హిల్స్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. గణేశ్‌నగర్ కాలనీలో నాలుగు నెలలుగా తాగునీటి సరఫరా కావడం లేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. 12వ డివిజన్ మార్కండేయ కాలనీ (మంగలికుంట)లో 50రోజులుగా తాగునీటి సరఫరా కావడం లేదని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 43వ డివిజన్ బెస్తంచెరువు ప్రాంతంలో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని, ఫాగింగ్ చేయడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. వరంగల్ పాత బీటు బజార్‌లోని విజయ అపార్ట్‌మెంట్‌లో హరిరాం చవాన్ అండ్ బ్రదర్స్ షెడ్లు నిర్మిస్తున్నారని, వాటిని తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని అపార్ట్‌మెంట్ కమిటీ ఫిర్యాదు చేసింది. 18వ డివిజన్ క్రిష్టియన్‌కాలనీ, శాలినీ నగర్‌లోని క్రిష్టియన్, హిందూ శ్మశాన వాటికలు దురాక్రమణకు గురవుతున్నాయని, పరిరక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ గ్రేటర్‌లోని చెరువుల్లో పూడికతీత పనులు ప్రారంభించాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌ల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో 101 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 44, ఇంజినీరింగ్ 28, ప్రజారోగ్యం 11, పన్నులు 9, తాగునీటి సరఫరా 7, హార్టికల్చర్ 1, సాధారణ విభాగానికి ఒక్క వినతి వచ్చాయి. అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి పాల్గొన్నారు.

## డాక్టర్స్ ప్రీమియం లీగ్ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా, మే 5: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), వరంగల్ డాక్టర్స్ క్రికెట్ క్లబ్ (డబ్ల్యూడీసీసీ) సంయుక్తంగా నిర్వహించే డాక్టర్స్ ప్రీమియం లీగ్ (డీపీఎల్) సీజన్-2 పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం వరంగల్ ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు, క్లబ్ ప్రతినిధులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పసన్నకుమార్ మాట్లాడుతూ మే 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పది రోజుల పాటు కాకతీయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డీపీఎల్ సీజన్-2లో మొత్తం 8 టీమ్‌లు 15 మ్యాచులు ఆడుతాయని పేర్కొన్నారు. మే 26వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలిపారు. ఐఎంఏ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, కార్యదర్శి అజిత్ మహమ్మద్, శిరీష్‌కుమార్, విజయచందర్‌రెడ్డి, రాఘవేంద్ర ప్రదీప్, ప్రసన్నకుమార్, నదీం, నరేష్, సంధ్యారాణి, జనార్దన్, బందెల మోహన్‌రావు, కూరపాటి రమేశ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వర్ధన్నపేట, మే 5: రోడ్డు ప్రమాధంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కట్ర్యాల సమీపంలో పెట్రోల్ బంకు వద్ద జరిగింది. మండలంలోని కడారిగూడెంకు చెందిన సిలువేరు రాజు(32) వరంగల్‌కు వ్యక్తిగత పనిమీద వెళ్లి తిరిగివస్తూ కట్ర్యాల సమీపంలోని పెట్రోల్‌బంకులో తన బైక్‌లో పెట్రోల్ పోయించుకొని రోడ్డు దాటుతున్నాడు. వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు వెళ్తున్న బుల్లెట్ బైక్ ఢీకొట్టింది. దీంతో రాజుకు తీవ్రంగా గాయాలు కాగా వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టరేట్ అందుకున్న రాజేశ్‌నాయక్


డాక్టరేట్ అందుకుంటున్న రాజేశ్‌నాయక్

రాయపర్తి, మే 5: హోప్ థియాలాజికల్ విశ్వ విద్యాలయం (హెచ్‌టీయూ) తనకు డాక్టర్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీసెస్ అవార్డుతో పాటు డాక్టరేట్‌ను సోమవారం ప్రదానం చేసినట్లు మండలంలోని బాలునాయక్ తండా (సన్నూరు)కు చెందిన సామాజిక సేవా కార్యకర్త భూక్యా రాజేశ్‌నాయక్ తెలిపారు. కొన్నేళ్లుగా తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో హెచ్‌టీయూ నేషనల్ డైరెక్టర్ పండు ప్రేమ్ కుమార్, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రవర్ధన్ సమక్షంలో అందజేసినట్లు వివరించారు. తెలంగాణ కార్యదర్శి సంజీవరావు, హెచ్‌టీయూ చైర్మన్ డేవిడ్‌పాల్, డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

## ఓంకార్ శతజయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా, మే 5: ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ సభ పోస్టర్‌ను ఎంసీపీఐ(యూ) నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఓంకార్ భవన్‌లో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 12న మచ్చాపూర్ ఓంకార్ స్థూపం వద్ద శతజయంతి వార్షికోత్సవాల ప్రారంభ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

వరంగల్ చౌరస్తా, మే 5 : ఎంజీఎం దవాఖానలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1వ తేదీన అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని 108 సిబ్బంది ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. నాటి నుంచి చికిత్సపొందుతూ ఆదివారం మధ్యాహ్నం సుమారు 3గంటలకు మృతి చెందాడు. వైద్యులు, మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. పసుపురంగు టీ షర్ట్ ధరించి, తల నీలాలు, గడ్డం నలుపు రంగులో ఉందని, 5 అడుగుల ఒక అంగులం ఎత్తు కలిగి ఉన్నాడని వివరించారు. మృతుడికి సంబంధించిన వారు మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించడం లేదా 87126 85005 నంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ తుమ్మ గోపిరెడ్డి కోరారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నర్సంపేట, మే 5: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం 243 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆర్డీవో ఉమారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట, మే 5: మెడికల్, లీగల్ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీకే నామ్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సుప్రియా రత్నకుమార్ గౌడి అన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జీకే నామ్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్, లీగల్ సహకారంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్యసేవలతో పాటు చట్టపరమైన అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## తాటివనం దహనం

నర్సంపేట, మే 5: మండలంలోని ముగ్దుంపురంలో గ్రామ శివారు జయముఖి కళాశాల ఆవరణలో ఉన్న తాటివనాన్ని యాజమాన్యం దహనం చేసింది. కళాశాల ఆవరణలో ఉన్న తాటి చెట్లను తాము ఏళ్లుగా గీస్తూ జీవిస్తున్నామని, ఇప్పుడు తమకు తెలియకుండా పెద్దవి, చిన్నవి కలిపి సుమారు 150 చెట్ల వరకు దహనం చేశారని గీతకార్మికులు తెలిపారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

## శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

కాశీబుగ్గ, మే 5: కశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతులు, రాజమండ్రిలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి చేకూరాలని ఈనెల 7న శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం నర్సంపేట రోడ్డులోని బెతెస్త చర్చ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 7న ఉదయం 8గంటలకు పబ్లిక్ గార్డెన్స్ నుంచి హనుమకొండలోని కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రైస్తవులు, చర్చ్ నిర్వాహకులు బ్యానర్లు, ప్లకార్డులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. అబ్రహం కాకిలేటి, బోడ డిన్నా, ఫ్రాంక్లిన్ సుధాకర్, బాషిపాక ఏలియా, శ్రీనివాస్ నాయక్, పోలెపాక సీతయ్య, సుప్రియా సర్వేష్, ఎన్ ప్రవీణ్, సందెల లాజర్, కొల్లూరి కిరణ్ పాల్గొన్నారు.

## వృద్ధురాలికి చేయూత

మట్టెవాడ, మే 5: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఓ వృద్ధురాలికి చేయూతనందించింది. నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన కందిమల్ల మాధవి వయోభారం, అనారోగ్యంతో మంచాన పడింది. తమ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆమెకు చేయూతనందించారు. వీల్‌చైర్‌తోపాటు రూ.10వేల నగదు, 50కిలోల బియ్యాన్ని అందించారు. వరంగల్ జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు పుల్లూరు మధు, జాతీయ కార్యవర్గ సభ్యుడు న్యాఢీల్లీ గట్టు మహేశ్‌బాబు, మహిళా జిల్లా అధ్యక్షురాలు వల్లాల శైలజ, ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి సురేష్, వైస్ ప్రెసిడెంట్ మంచాల విజయ్, వ్యాపారవేత్తలు ఆకారపు శశిధర్, ఆకారపు అనిల్ పాల్గొన్నారు.

## కాల్షియం కార్బైడ్ వాడితే చర్యలు

కాశీబుగ్గ, మే 5: కాల్షియం కార్బైడ్ వాడితే చర్యలు తప్పవని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఏనుమాముల, లక్ష్మీపురం, నర్సంపేట్‌రోడ్డు, గొర్రెకుంటలోని మామిడి ఖరీదుదారులు, ఎగుమతిదారుల గోదాంలను తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇథలిన్ మాత్రమే ఉపయోగించాలని సూచించారు. డీఎంఓ కలకోట్ల సురేఖ, కార్యదర్శి జీ రెడ్యా, గ్రేడ్-2 కార్యదర్శి శ్రీరామోజు రాము, సిబ్బంది పాల్గొన్నారు.